




చింతపల్లిలో వర్షం
8లో

లంబసింగికి పర్యాటకుల తాకిడి

- ప్రకృతి అందాల వీక్షణకు బారులు
- చెరువులవేనం వద్ద ఫొటోలకు పోటీ


చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద మంచు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

చింతపల్లి, సెప్టెంబరు 22: ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి పర్యాటకుల తాకిడి పెరిగింది. వాతావరణంలో మార్పు రావడం, మంచు కురుస్తుండడంతో ప్రకృతి అందాలను వీక్షించేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. ఆదివారం భారీ సంఖ్యలో పర్యాటకులు లంబసింగికి తరలివచ్చారు. ఉదయం ఐదు గంటల నుంచే లంబసింగి, చెరువులవేనం, తాజంగి జలాశయం వద్ద పర్యాటకుల సందడి ప్రారంభమైంది. చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు మంచు అందాలను తిలకిస్తూ ఎంజాయ్ చేశారు. పచ్చని అడవులను తాకుతూ పయనిస్తున్న మంచు మేఘాల సరసన ఫొటోలు తీసుకునేందుకు పర్యాటకులు పోటీపడ్డారు. సాయంత్రం వరకు పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో రద్దీగా కనిపించాయి.

పాడేరుపై మంచు దుప్పటి

- జిల్లాలో తగ్గిన ఉష్ణోగ్రతలు
- పాడేరు 20 డిగ్రీలు, మినుములూరు 18 డిగ్రీలు


పాడేరును కప్పుకున్న మంచు దుప్పటి


మంచు అధికంగా ఉండడంతో లైట్లు వేసుకొని వస్తున్న వాహనదారులు

పాడేరురూరల్, సెప్టెంబరు 22: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరును ఆదివారం మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం 8 గంటల వరకు దట్టంగా మంచు కురిసింది. ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఆదివారం పాడేరులో 20 డిగ్రీలు, మినుములూరులో 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాహనదారులు రహదారి కనిపించక వాహనాలకు లైట్లు వేసుకొని ప్రయాణాలు సాగించారు.

బదిలీల జాతర

ప్రభుత్వ శాఖల్లో పలువురికి స్థానచలనం

- జడ్పీ సీఈవోగా నారాయణమూర్తి
- డీపీవోగా బి.లవరాజు
- ఉమ్మడి జిల్లా నుంచి ఇతర జిల్లాలకు తొమ్మిది మంది ఎంపీడీవోలు..
- ఇతర జిల్లాల నుంచి ఎనిమిది మంది రాక
- జిల్లా నుంచి నలుగురు తహసీల్దార్లు విశాఖ, అనకాపల్లికు..
- జిల్లాకు ముగ్గురు తహసీల్దార్లు రాక..

విశాఖపట్నం/పాడేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పలు ప్రభుత్వ శాఖలలో బదిలీల ప్రక్రియ పూర్తయింది. పలువురు జిల్లాస్థాయి అధికారులు ఇక్కడి నుంచి బదిలీ కాగా, మరికొందరు ఇతర జిల్లాల నుంచి వచ్చారు. ఖాళీగా ఉన్న విశాఖపట్నం జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా కాకినాడ డీఎల్‌డీవో పి.నారాయణమూర్తిని నియమించారు. డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణను శ్రీకాకుళం జిల్లాపరిషత్ డిప్యూటీ సీఈవోగా బదిలీ చేసి ఆయన స్థానంలో విజయనగరం డీఎల్‌డీవో కె.రాజ్‌కుమార్ నియమించారు. పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఎస్ఈగా కొనసాగుతున్న బి.శ్రీనివాసరావుకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. జిల్లా పంచాయతీ ఆఫీసర్‌గా బి.లవరాజు నియమితులయ్యారు. ఈయన శ్రీకాకుళం నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. అలాగే పాడేరు డీఎల్‌డీవో డి.శాంతలక్ష్మి అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీపీవోగా బదిలీ అయ్యారు.

ఎంపీడీవోలు..

ఉమ్మడి విశాఖ జిల్లాలో పనిచేస్తున్న తొమ్మిది మంది ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు కేటాయించగా, ఇతర జిల్లాల నుంచి ఎనిమిది మంది ఇక్కడికి వస్తున్నారు. ఏజెన్సీలోని పలువురు ఎంపీడీవోలకు అంతర జిల్లాల బదిలీలు జరిగాయి. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులు ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రం పాడేరు ఎంపీడీవో కె.సాయినవీన్‌ను తూర్పుగోదావరి జిల్లాలకు, ముంచంగిపుట్టు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్, జి.మాడుగుల ఎంపీడీవో ఆర్.లోహిత్‌దయాసాగర్‌లను పశ్చిమగోదావరి జిల్లాలకు, హుకుంపేట ఎంపీడీవో ఆర్.వెంకటరావును శ్రీకాకుళం, అరకులోయ ఎంపీడీవో సీహెచ్.వెంకటేశ్, పెదబయలు ఎంపీడీవో ... మిగతా 8వ పేజీలో


విశాఖపట్నం జిల్లా పరిషత్ కార్యాలయం

పాడేరు డీఎఫ్‌వోకు సత్యసాయి జిల్లాకు బదిలీ

- చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణకు ఏలూరు

పాడేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ కె.వినోద్‌కుమార్‌కు సత్యసాయి జిల్లా డీఎఫ్‌వోగా బదిలీ అయింది. అయితే ఆయన స్థానంలో ఇంకా ఎవర్నీ నియమించలేదు. అలాగే చింతపల్లి డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సీహెచ్.సూర్యానారాయణను ఏలూరు డీఎఫ్‌వోగా బదిలీ చేశారు. అలాగే గిద్దలూరులో డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(డిప్యూటీ సీఎఫ్)గా పని చేస్తున్న వైవీ.నరసింహారావును చింతపల్లి డీఎఫ్‌వోగా నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.


కె.వినోద్‌కుమార్

గురుకుల కళాశాలలో కంప్యూటర్ విద్య

ఇంటర్ విద్యార్థులకు అదనపు కోర్సు

- ప్రయోగాత్మకంగా చింతపల్లిలో ప్రారంభం
- ఉపాధి అవకాశాలకు ప్రత్యేక కార్యాచరణ
- నూతన సంస్కరణలకు తెరతీసిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం

చింతపల్లి, సెప్టెంబరు 22: గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థులకు కంప్యూటర్ విద్యా బోధన అందుబాటులోకి తీసుకువచ్చింది. వృత్తి విద్య కోర్సులతోపాటు కంప్యూటర్ విద్యపై విద్యార్థులు పట్టు సాధించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. దీనిని చింతపల్లి టీడబ్ల్యూ గురుకుల కళాశాలలో ప్రయోగాత్మకంగా ప్రారంభించింది.

రానున్న రోజుల్లో ప్రతి టీడబ్ల్యూ గురుకుల కళాశాలలో కంప్యూటర్ శిక్షణ ఇచ్చేందుకు ఉన్నతాధికారులు కార్యాచరణ రూపొందించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం వృత్తి విద్య కోర్సులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని గిరిజన సంక్షేమ శాఖ గురుకులం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ఈ ఏడాది ఇంటర్ విద్యార్థులకు అదనపు కోర్సుగా కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నది. గురుకులం కార్యదర్శి సదా భార్గవి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చింతపల్లి కళాశాలలో కంప్యూటర్ విద్యా బోధన ప్రారంభించేందుకు కృషి చేశారు. స్థానిక టీడబ్ల్యూ గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులతోపాటు వృత్తి విద్య కోర్సు అకౌంట్స్ అండ్ ట్యాక్స్ (ఏఎన్‌టీ) ఉన్నది. ఏఎన్‌టీ కోర్సులో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 20 సీట్లు చొప్పున ఉన్నాయి. ప్రస్తుత రోజుల్లో ఈ కోర్సుకు ప్రత్యేక డిమాండ్ ఉంది. ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని మరో ఏడాదిపాటు కంప్యూటర్ విద్యను నేర్చుకోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియేట్‌తోపాటు ఏఎన్‌టీ విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్స్ కోర్సులో శిక్షణ ప్రారంభించారు.

కళాశాలలో ప్రత్యేక ల్యాబ్..

టీడబ్ల్యూ గురుకుల కళాశాలలో ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటుచేశారు. గురుకులం కార్యదర్శి శిక్షణకు అవసరమైన 15 న్యూజెనరేషన్ డెస్క్ టాప్ కంప్యూటర్లు చింతపల్లి కళాశాలకు పంపించారు. కంప్యూటర్‌లో ల్యాబ్‌లో ఒకేసారి 15 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్ చేసే విధంగా ఏర్పాటు చేశారు. అలాగే ల్యాబ్ వద్ద థియరీ బోధన కోసం డిజిటల్ క్లాస్ రూం సిద్ధం చేశారు.

కంప్యూటర్ కోర్సులు..

కళాశాలలో ఏఎన్‌టీ కోర్సులో విద్యాభ్యాసం చేస్తున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బేసిక్ కోర్సులపై బోధన అందిస్తున్నారు. ప్రధానంగా డీటీపీ, ఎంఎస్ ఆఫీస్, ఫొటోషాప్, ట్యాలీ ఈఆర్‌పీ-9 కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు కంప్యూటర్ అధ్యాపకులు సీతారాం, సుబ్బారావు అందుబాటులో ఉన్నారు. ప్రతి రోజూ రెండు పిరియడ్స్ కంప్యూటర్ శిక్షణకు కోసం కేటాయించారు. దీంతో విద్యార్థులు ఈఎన్‌టీ పాఠ్యాంశాలతోపాటు కంప్యూటర్ కోర్సులను ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.


టీడబ్ల్యూ గురుకుల కళాశాలలో కంప్యూటర్ శిక్షణ పొందుతున్న ఇంటర్ విద్యార్థులు

కంప్యూటర్ విద్య సువర్ణ అవకాశం



ఇంటర్మీడియట్ విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందుబాటులోకి రావడం సువర్ణ అవకాశం. ఏఎన్‌టీ విద్యార్థులకు కంప్యూటర్ విద్య చాలా అవసరం. ఈ కోర్సులో శిక్షణ పొందడం వల్ల ఉన్నత విద్య సీఏ, బీకాం, కంప్యూటర్ కోర్సులు సులభంగా ఉంటుంది. ఇంటర్‌తోనే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఆడిట్, ఇన్‌కం ట్యాక్స్ విభాగాల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉన్నది. గురుకులం అధికారులు ఇంటర్ విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందుబాటులోకి తీసుకొని రావడం చాలా శుభపరిణామం.

- కేవీ రామేశ్వరం, ప్రిన్సిపాల్

సీజన్ నాటికి రిసార్టులు రెడీ

పర్యాటకులకు అందుబాటులోకి గదులు

- పనులు వేగవంతానికి చర్యలు
- ఏపీటీడీసీ సీఈ నరసింహారావు


మయూరి హిల్‌రిసార్టులో ఆధునికీకరణ చేయాల్సిన గదులను పరిశీలిస్తున్న సీఈ నరసింహారావు, ఎస్ఈ ఈశ్వరయ్య

అరకులోయ, సెప్టెంబరు 22: పర్యాటక శాఖ రిసార్టుల ఆధునికీకరణ పనులు సీజన్ నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు ఏపీటీడీసీ చీఫ్ ఇంజనీర్ నరసింహారావు తెలిపారు. ఆదివారం టైడా జంగిల్ బెల్స్, అరకులోయలో పున్నమి రిసార్టు, మయూరి రిసార్టు, అమీబా కాటేజీల ఆధునికీకరణ పనులను ఎస్ఈ ఈశ్వరయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు, పనులను పర్యవేక్షిస్తున్న ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అక్టోబరు మొదటి వారం నాటికి మొదటి ఫేజ్‌లో ఉన్న పున్నమి రిసార్టుకు చెందిన 20 రూంలు, మయూరి హిల్ రిసార్టులో 16 రూంలు, క్రాఫ్ట్‌విలేజ్‌లో 20, అమీబా కాటేజీలకు సంబంధించి 13 గదులను సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. టైడా జంగిల్‌బెల్స్‌లో కాటేజీల ఆధునికీకరణకు రూ.11 కోట్లు, యాత్రీ నివాస్‌ను రూ.7.6 కోట్లతో, మయూరి హిల్ రిసార్టును రూ.12 కోట్లతో ఆధునికరిస్తున్నట్టు చెప్పారు. బ్యాంకు రుణాలు తీసుకొని ఈ పనులు చేస్తున్నట్టు చెప్పారు. పనులను పూర్తి చేయడంతో కాస్త జాప్యం జరిగిందన్నారు.

అరకు-లంబసింగి కారిడార్ అభివృద్ధి

బి.ఈశ్వరయ్య, ఎస్ఈ, ఏపీటీడీసీ.

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ స్వదేశీ దర్శన్-2 పథకంలో అరకు-లంబసింగి కారిడార్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు ఏపీటీడీసీ ఎస్ఈ బి.ఈశ్వరయ్య తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక కేంద్ర బృందం పర్యటించి, డీపీఆర్‌ను సిద్ధం చేస్తుందన్నారు. ఈ కారిడార్‌కు రూ.70 కోట్లు నుంచి రూ.100 కోట్లు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ పథకంతో పర్యాటక ప్రాంతాలలో మరిన్ని అదనపు సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. సీఈ వెంట ఈఈ కె.రమణ, డీఈఈ స్వామి, ఏఈఈ రాము, వర్క్ఇన్‌స్పెక్టర్ అప్పారావు, రిసార్టుల మేనేజర్లు పాత్రుడు, దేముడుబాబు ఉన్నారు.


అమ్మవారి మొక్కులు తీర్చుకొనేందుకు ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

మోదకొండమ్మ ఆలయంలో పండగ సందడి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయం

పాడేరురూరల్, సెప్టెంబరు 22: మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి మన్యంలోని భక్తులతోపాటు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం కనిపించింది. మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు మొక్కులు తీర్చుకొనేందుకు పాడేరుకు చేరుకొని భారీ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బంధు,మిత్రులతో ఆలయ ప్రాంగణంలో వంటలు చేసుకొని పండగ చేసుకున్నారు. దీంతో సాయంత్రం 5 గంటల వరకు మైదాన ప్రాంత భక్తులతో ఆలయం కళకళలాడింది. అదేవిధంగా పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద గల అమ్మవారి పాదాలకు మైదాన ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకొని పండగను చేసుకున్నారు.

అన్ని వర్గాలను ఆదరించే కూటమి ప్రభుత్వం మంచిది


- ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి


మర్రిపాలెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

కొయ్యూరు, సెప్టెంబరు 22: అన్ని వర్గాలను ఆదరించే కూటమి ప్రభుత్వమే మంచిదని, ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. ఆదివారం మండలంలో మూలపేట పంచాయతీ మర్రిపాలెంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం పింఛన్ రూ.4 వేలకు పెంపు, అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయడం, మెగా డీఎస్సీ ప్రకటించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన వంద రోజుల్లోనే ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, డీఎస్సీ నోటిఫికేషన్ వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. రూ.5లకే అన్న క్యాంటీన్ల ద్వారా పేదల ఆకలి తీర్చుతుందన్నారు. వంద రోజుల్లో అందించిన ప్రజా పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మేరీరోస్, మండల జేఈఈ రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, జీసీసీ మాజీ చైర్మన్ ఎంపీపీ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, నేతలు కిల్లు రమేష్‌నాయుడు, బొర్ర విజయరాణి, గరైంగి రాజేశ్వరి, కిట్లంగి పద్మ, కిల్లో పూర్ణచంద్రరావు, ఏలూరి రత్నం, లేగుల పుష్పలత, బోనంగి సత్యవతి, ఉల్లి వెంకటేశ్వర్లు, జి. సత్యనారాయణ, కొర్ర రామూర్తి, పి.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ హెచ్చరిక కేంద్రం..
స్వర్ణోత్సవ సంబరం

విశాఖలో కేంద్రం ఏర్పాటు చేసి 50 వసంతాలు పూర్తి



విశాఖలోని తుఫాన్ హెచ్చరిక కేంద్రం

రానున్న 24 గంటల్లో ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది... తీరం వెంబడి గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి... మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదు... ఈసారి వేసవిలో ఎండల తీవ్రత అధి కంగా ఉంటుంది. ఇటువంటి ప్రకటనల ద్వారా వాతావర ణంలో మార్పులను ఎప్పటికప్పుడు వెలువడించి ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ.. ఆస్తి, ప్రాణ నష్టాల నుంచి కాపాడుతున్నది తుఫాన్ హెచ్చరిక కేంద్రం. ఈ కేంద్రాన్ని విశాఖలో ఏర్పాటు చేసి, నేటితో సరిగ్గా 50 వసంతాలు పూర్తయ్యాయి. తూర్పు తీరంలో తుఫాన్ల ప్రభావానికి ఎక్కువగా గురయ్యే ప్రాంతాల్లో కోస్తా కూడా ఉండడంతో భారత ప్రభుత్వం నగరంలో తుఫాన్ హెచ్చరిక కేంద్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ కేంద్రం ఏర్పాటు చేసి సోమవారానికి 50 ఏళ్లు పూర్తయ్యాయి. ఈమేరకు మంగళవారం వేడుకలు నిర్వహించనున్నారు. - విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

తూర్పు తీరంలో తుఫాన్ల ప్రభావానికి గురైన ప్రాంతాల్లో ఏపీ కోస్తా తీరం ఒకటి. ఏటా వచ్చే వరదలతో అపార ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతోంది. 1970 దశకంలో వచ్చిన తుఫాన్ల తీవ్రతకు కోస్తా, ఒడిశా భారీగా దెబ్బతిన్నాయి. తుఫాన్ సమాచారం కోసం ఎక్కడో ఢిల్లీ లేదా చెన్నై, హైదరాబాద్‌లో ఉన్న వాతావరణ శాఖాధికారులపై ఆధార పడాల్సిన రోజులవి. దీనికి తెరదించుతూ కోస్తా, ఒడిశాలో తుఫాన్ హెచ్చరిక కేంద్రాలు ఏర్పాటు చేయాలని భారత వాతావరణ శాఖ ఆలోచన చేసి 1974లో సైక్లోన్ డిస్ట్రెస్ మిటిగేషన్ కమిటీని నియమించింది. ఈ కమిటీ అధ్యయనం చేసి విశాఖపట్నం, భువనేశ్వర్‌లో కేంద్రాలు నెలకొల్పాలని సిఫార్సు చేసింది. దాని ఫలితంగానే 1974 సెప్టెంబరు 23న వాల్తేర్‌లో తుఫాన్ హెచ్చరిక కేంద్రం ఏర్పాటైంది. దీనికి తొలి డైరెక్టర్‌గా సేన్‌రాయ్ నియమితులయ్యారు.

1870లో వాతావరణ పరిశీలనా కేంద్రం ఏర్పాటు

విశాఖలో 1870లోనే వాతావరణ పరిశీలనా కేంద్రం ఏర్పాటు చేశారు. నీటి పారుదల శాఖ కార్యాలయం ఆవరణలో అబ్జర్వేటరీ నెలకొల్పి బెలూన్లు ఎగురవేసి దాని ఆధారంగా నగరంలో వాతావరణం తెలుసుకునేవారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో విశాఖ ఎయిర్‌పోర్టులో వాతావరణం అందించే (ఫోర్‌కాస్టింగ్‌యూనిట్) విభాగాన్ని ఏర్పాటు చేశారు. అమెరికా నిర్వహించే రేడియో సౌండ్ సిస్టమ్ ఆధారంగా ఎయిర్ పోర్టులో విమానాల రాకపోకలకు బెలూన్లు ఎగురవేసేవారు. తరువాత 1944లో స్టేషన్‌ను సెల్ఫ్ రికార్డింగ్ పరికరాలతో మరింత ఆధునికీకరించారు. మహారాణిపేట నీటి పారుదల శాఖలో నెలకొల్పిన అబ్జర్వేటరీని తీసుకెళ్లి ఎయిర్‌పోర్టుకు మార్చి కొంతకాలం నిర్వహించారు. దీన్ని 1949-50లో ఏయూకి తరలించారు. మరింత సమాచారం కోసం ఇదే కేంద్రంలో ఫ్యాన్‌టైప్ రేడియో సౌండ్ సిస్టమ్, రేడియేషన్ యూనిట్, మోటాక్స్ రేడియో థియోడోలైట్ యూనిట్లు ప్రారంభించారు. తర్వాత 1961లో ఇక్కడే సిస్మోలాజికల్ యూనిట్ ఏర్పాటు చేశారు.

సొంత భవనం ఏర్పాటు ఇలా..

ఈ విభాగానికి సొంత భవనం ఏర్పాటు చేయాలన్న తలంపుతో కిర్లంపూడి లేఅవుట్ (ప్రస్తుతం తుఫాన్ హెచ్చరిక కేంద్రం ఉన్న భవనం)లో 1970లో భవనం నిర్మించి ఏయూలోని రేడియో సౌండ్ యూనిట్‌ను తరలించారు. 2.7 ఎకరాల విస్తీర్ణంతో కూడిన స్థలాన్ని ఏయూ నుంచి 99 ఏళ్లకు లీజుకు తీసుకున్నారు. అదే సమయంలో ఎస్. బ్యాండ్ (10 సెం.మీ.లు) జేఆర్‌సీ తుఫాన్లు పసిగట్టే రాడార్ దేశంలో తొలిసారి డాల్ఫిన్ నోస్ కొండపై నెలకొల్పారు. ఎయిర్ పోర్టులో వాతావరణ శాఖ కార్యాలయం, ఏయూలో రేడియేషన్ సిస్మోలాజీ యూనిట్ల పర్యవేక్షణకు భారత్ వాతావరణ శాఖ సేన్‌రాయ్‌ను గ్రేడ్-1 అధికారిగా నియమించింది. ఆ క్రమంలోనే 1973లో సైక్లోన్ డిస్ట్రెస్ మిటిగేషన్ కమిటీ సిఫారసు మేరకు 1974 సెప్టెంబరు 23న ఇదే భవనంలో తుఫాన్ హెచ్చరిక కేంద్రం ఏర్పాటైంది. శాఖాపరమైన మార్పుల నేపథ్యంలో 1986లో ఎయిర్‌పోర్టులో ఫోర్‌కాస్టింగ్ యూనిట్ మూసివేసినా నేవీ ఆధ్వర్యంలో అబ్జర్వేటరీ పనిచేస్తోంది. డాల్ఫిన్‌నోస్‌పై ఉండే రాడార్ స్థానంలో 1982లో ఈ ఈసీ రాడార్ నెలకొల్పి అక్కడ ఉండే ఉపరితల వాతావరణ పరిశీలనా కేంద్రాన్ని తుఫాన్ హెచ్చరిక కేంద్రానికి తీసుకువచ్చారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తరువాత విశాఖలో వాతావరణం కోసం పనిచేసే స్టేషన్లను మార్పు చేయడంలో భాగంగా 1983లో వి.శాట్ స్టేషన్ ఏర్పాటు, ఇంకా 1985లో విపత్తు హెచ్చరిక వ్యవస్థ, 2002లో హైవిండ్ స్పీడ్ రికార్డర్, 2003లో ఉపగ్రహాల ద్వారా వచ్చే వాతావరణ డేటా చిత్రాలు, వరల్డ్ స్పేస్ డిజిటల్ రిసీవర్ నెలకొల్పారు. డాల్ఫిన్‌నోస్‌పై ఉన్న రాడార్‌కు బదులుగా కైలాసగిరి కొండపై 2006లో జర్మన్‌కు చెందిన వెదర్‌డాప్లర్ రాడారును నెలకొల్పారు. ఈ కేంద్రం 500 కి.మీ. పరిధిలో వాతావరణ మార్పులపై ఎప్పటికప్పుడు ఛాయాచిత్రాలను నిక్షిప్తం చేస్తోంది. ఇంకా 2017లో నౌకాస్టు (మూడు గంటల వ్యవధిలో సంభవించే వాతావరణ మార్పులు తెలిపే) వ్యవస్థ ఏర్పాటైంది.

- 1870లో తొలుత వాతావరణ పరిశీలన కేంద్రం ఏర్పాటు
- 1974 సెప్టెంబరు 23న తుఫాన్ హెచ్చరిక కేంద్రంగా మార్పు
- దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇదొక్కటి
- రేపు వేడుకలు

క్షణాల్లో తుఫాన్లపై సమాచారం

ఈ కేంద్రం ఏర్పాటు తరువాత బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫానపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. అల్పపీడనం నుంచి తుఫాన్‌గా మారి తీరం దాటే వరకు నిరంతరం పర్యవేక్షించి ఎప్పటికప్పుడు బులెటిన్ల రూపేణా విడుదల చేస్తున్నారు. సగటున ఏడాదికి ఒక తుఫాన్ అయినా కోస్తా తీరం తాకుతున్న నేపథ్యంలో ఈ కేంద్రం ఇస్తున్న సమాచారం ఎంతగానో ఉపయోగపడుతోంది. 24 గంటల పాటు పనిచేసే ఈ కేంద్రం నుంచి రైతులకు విలువైన సమాచారం అందిస్తున్నారు. ప్రతిరోజూ 100కి పైగా రైతులు వాతావరణం కోసం ఫోన్లు చేస్తుంటారు. ఉదయం ఆరుగంటలు, మధ్యాహ్నం 1.30 గంటలు, సాయంత్రం ఆరుగంటలు, రాత్రి 11 గంటలకు మత్స్యకారులకు బులెటిన్లు జారీ చేస్తారు. స్వాతంత్ర్యానంతరం ప్రారంభించిన బెలూన్లు విడిచిపెట్టే విధానం ఇప్పటికీ కొనసాగిస్తూ రోజుకు రెండు సార్లు ఉపరితలంలోకి వాటిని పంపిస్తారు.

ఆనందంగా ఉంది

- భారతి శ్రీకాంత్ సాభ్లే, డైరెక్టర్, తుఫాన్ హెచ్చరిక కేంద్రం



కోస్తాకు తుఫాన్ల తాకిడికి సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చేందుకు 1974లో ఇక్కడ తుఫాన్ హెచ్చరిక కేంద్రం ఏర్పాటైంది. అప్పట్లో అందుబాటులో ఉన్న సమాచారం, పలు రకాల సాధనాల ద్వారా వచ్చే వివరాల మేరకు బులెటిన్లు ఇచ్చేవారు. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడం, కైలాసగిరిపై డాప్లర్ వెదర్ రాడార్ ఏర్పాటు, ఉపగ్రహ ఛాయాచిత్రాలు లభించడంతో ఇప్పుడు కోస్తా ప్రజలకు ఖచ్చితమైన సమాచారం అందిస్తున్నాం. నా హయాంలో 50 ఏళ్ల వేడుకలు జరగడం ఆనందంగా ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నక్కపల్లి, సెప్టెంబరు 22: మండలంలోని ఉద్దండపురం హైవేపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందినట్టు సీఐ కుమారస్వామి చెప్పారు. ఉద్దండపురానికి చెందిన ఆవాల దుర్గారావు (27) శనివారం అర్ధరాత్రి రోడ్డు దాటుతుండగా.. అడ్డరోడ్డు నుంచి తుని వైపు వెళుతున్న కారు ఢీకొన్నట్టు సీఐ చెప్పారు. తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలో ఉన్న దుర్గారావును తుని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా, మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని చెప్పారు. అందిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ వెంకట్రావ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 22: స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. అర్ధరాత్రి సమాచారం అందడంతో ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు ఉండకుండా వెనువెంటనే సిబ్బందితో మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి పోస్టుమార్టం గదిలో భద్రపరిచామన్నారు. మృతురాలు వయసు 60 ఏళ్లు ఉండొచ్చనని, భిక్షగత్తెగా అనుమానంగా ఉందన్నారు. ఎవరైనా గుర్తిస్తే పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందివ్వాలని కోరారు.

కొప్పాక ఏలేరు కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొత్తూరు, సెప్టెంబరు 22 : మండలంలోని కొప్పాక వద్ద ఏలేరు కెనాల్ నాగమ్మ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. సుమారు 45 ఏళ్ళు వయస్సు ఉంటుందని ఎరుపు, తెలుపు రంగులతో కూడిన చొక్కా, నలుపు రంగు జీన్ ఫ్యాంటు ధరించాడన్నారు. కాగా మృతదేహాన్ని గుర్తు పట్టలేనంతగా ఉందని, కేవలం అతను ధరించిన దుస్తులు ఆధారంగా ఎవరైనా గుర్తిస్తే అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ 9440796085, 9440796075 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు. కాగా సంఘటనా స్థలాన్ని అనకాపల్లి రూరల్ సీఐ అశోక్ కుమార్ పరిశీలించి, మృతుడు వివరాలపై ఆరా తీశారు.

1500 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

కోటవురట్ల, సెప్టెంబరు 22: మండలంలోని బాపిరాజుకొత్తపల్లి గ్రామంలోని సారా బట్టీలపై ఆదివారం తెల్లవారుజామున పోలీసులు దాడి చేసి 1500 లీటర్ల బెల్లం పులుసు స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. బాపిరాజు కొత్తపల్లి గ్రామ శివారుల్లో జీడిమామిడితోటల్లో సారా తయారీ చేస్తున్నారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు కోటవురట్ల ఎస్‌ఐ రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా సారా తయారీకి సిద్ధంగా ఐదు డ్రమ్ముల్లో ఉన్న 1500 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు.

షెడ్డు పైనుంచి జారిపడి కార్మికుడికి గాయాలు

పరవాడ, సెప్టెంబరు 22 : నిర్మాణంలో ఉన్న షెడ్డు పైనుంచి కాలుజారి పడిపోవడంతో కాంట్రాక్టు కార్మికుడు గాయాలపాలయ్యాడు. ఫార్మాసిటీలోని కెమిక డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ జి. మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కెమిక డ్రగ్స్ పరిశ్రమ లోపల వేర్‌హౌస్ నిర్మాణ పనులను పశ్చిమ బెంగాల్ కార్మికులు చేస్తున్నారు.

శనివారం సాయంత్రం పనులు జరుగుతుండగా హాయిల్‌షేక్ (21) అనే కార్మికుడు షెడ్డుపై సిమెంట్ రేకులు వేస్తుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి కింద పడిపోయాడు. దీంతో కాలుకు, తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే తోటి కార్మికులు అతన్ని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ హత్య కేసులో నిందితుడి అరెస్టు

విశాఖపట్నం, సెప్టెంబరు 22 : విశాఖ రూరల్ తహసీల్దార్ రమణయ్య హత్య కేసులో నిందితుడు మురారి సుబ్రహ్మణ్య గంగారావును పీఎంపాలెం పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కి తరలించారు. మురారి తొలుత బెయిల్ పొందాడు. బెయిల్ రద్దయిన తరువాత ఎటువంటి సమాచారం లేకుండా నగరం విడిచి పారిపోయాడు. దీంతో కోర్టు అతనిపై నాన్ బెయిల్‌బుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఈమేరకు పోలీసులు ముద్దాయి కదలికలపై నిఘా పెట్టి విజయవాడలో ఆదివారం పట్టుకున్నారు. వెంటనే మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు.

నేటి పెన్షన్ వెరిఫికేషన్ రద్దు

కొత్తూరు, సెప్టెంబరు 22: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ వెరిఫికేషన్ కార్యక్రమం రద్దు చేశామని ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ హీ సేవా కార్యక్రమం వల్ల ఈ కార్యక్రమాన్ని రద్దు చేశామని తెలిపారు. మంగళవారం రీ షెడ్యూలు చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 24న రావికమతం, రోలుగుంట, మాడుగుల, 25న దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, చీడికాడ, 26న ఎస్.రాయవరం, మాకవరపాలెం, చీడికాడ ప్రాంతాలకు జరుగుతుందని ఆయన తెలిపారు.

సింహాచలం దేవస్థానం ఈఓగా త్రినాథరావు బాధ్యతల స్వీకరణ



త్రినాథరావుకు బాధ్యతలు అప్పగిస్తున్న డీసీ సుజాత

సింహాచలం, సెప్టెంబరు 22: సింహాచలం దేవస్థానం నూతన ఈఓగా వేంద్ర త్రినాథరావు ఆదివారం బాధ్యతలు స్వీకరిం చారు. ఆయన ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈమేరకు అప్పన్న ఆలయంలో ఇన్‌చార్జి ఈఓగా ఉన్న దేవదాయ శాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్. సుజాత నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింహాచలం ఈఓగా గతంలో పలుమార్లు తాత్కాలిక బాధ్యతలతో పనిచేశానని, అప్పన్న సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. స్వామివారి ఆస్తుల పరిరక్షణకు కృషి చేస్తూనే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు. కాగా తొలుత ఆయనకు దేవస్థానం ఉద్యోగులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని పూజలు చేసిన ఈఓ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత ఆలయ పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా, ఏఈఓ ఆనందకుమార్ శాలువతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు. అనంతరం దేవస్థానానికి చెందిన పలు విభాగాల అధికారులతో ఈఓ సమావేశం నిర్వహించారు. కల్తీ నెయ్యి, ప్రసాదాల తయారీ అంశాలపై చర్చించారు. ఈనెల 21న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సారథ్యంలో జరిగిన తనిఖీలపై చర్చించి, తీసుకోవలసిన చర్యలపై సమాలోచనలు చేశారు. విశాఖ డైయిరీ నుంచి నెయ్యిని యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలని నిర్ణయించారు. డెయిరీ యాజమాన్యంతో ఇప్పటికే సంబంధిత అధికారులు మాట్లాడగా మార్కెట్‌లో ఉన్న ధర కంటే తక్కువగా 15 కిలోల డబ్బాను రూ.9780లకు ఇచ్చేందుకు వారు సానుకూలత కనబరిచినట్టు ఈఓకు అధికారులు తెలపగా తక్షణమే కొనుగోలు చేయాలని ఆయన ఆదేశించినట్టు సమాచారం.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

తిరుపతి లడ్డూ అపవిత్రతపై వీహెచ్‌పీ నిరసన



కోటవురట్లలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

కోటవురట్ల, సెప్టెంబరు 22: తిరుపతి లడ్డూ అపవిత్రతపై విశ్వ హిందూ పరిషత్ నాయకులు ఆదివారం కోటవురట్ల జంక్షన్ వద్ద నిరసన ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు కలపడం కలిచి వేసిందన్నారు. హిందువులు ప్రత్యక్ష దైవంగా కొలుస్తున్న వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని కల్తీ చేయడం దుర్మార్గమన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, వాస్తవాలు హిందూ సమాజం ముందు ఉంచాలన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్రకార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్, కోశాధికారి వలిపర్తి దుర్గాప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్షణ కల్పించడమే లక్ష్యం

» మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్



సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 22 : ప్రజలకు రక్షణ కల్పించడమే కౌన్సిల్ ధ్యేయమని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్థానిక జార్జిక్లబ్ సమావేశమందిరంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు మళ్ల సన్యాసినాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నివారణకు మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు ప్రజలకు గ్రామస్థాయి నుంచి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. చట్టాలను ఉల్లంఘిస్తే మానవహక్కుల కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇప్పటివరకు చట్టాలను ఉల్లంఘించిన వారిపై ఆరు వేల కేసులు నమోదు చేయగా వాటిలో 1,200 కేసులకు తీర్పు వెలువడిందన్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గుర్తింపు కార్డులు అందజేశారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్‌వీ రమణ, బి. సురేష్, అనకాపల్లి, ఎలమంచిలి, చోడవరం, పాడేరు, అరకు, నర్సీపట్నం ప్రాంతాలకు చెందిన కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

చిన్న పిల్లల వైద్యుడు స్నేహిత్‌రెడ్డికి ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో ఫెలోషిప్

» ప్రతిష్ఠాత్మక ఐఏపీ ఫెలోషిప్ ఆక్స్‌ఫోర్డ్ ఇన్ పీడియాట్రిక్స్‌కు ఎంపిక



చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ స్నేహిత్ రెడ్డి

నర్సీపట్నం, సెప్టెంబరు 22 : నర్సీపట్నంలో నివాసం ఉంటున్న చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ స్నేహిత్ రెడ్డి ప్రతిష్ఠాత్మక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ హాస్పిటల్‌లో ఐఏపీ ఆక్స్‌ఫర్డ్ ఫెలోషిప్ ఇన్ పీడియాట్రిక్స్ కోర్సుకు ఎంపికయ్యారు. దేశ వ్యాప్తంగా 28 మంది చిన్నపిల్లల వైద్యులు ఈ ఫెలోషిప్ ఇంటర్వ్యూకు హాజరవగా, వారిలో ముగ్గురు మాత్రమే ఫెలోషిప్ ఆక్స్‌ఫోర్డ్ ఇన్ పీడియాట్రిక్స్‌కు ఎంపిక కావడం విశేషం. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులు సంయుక్తంగా ఇంటర్వ్యూ నిర్వహించారు. స్నేహిత్ రెడ్డి ఎండీ పీడియాట్రిక్స్‌తో పాటు అదనంగా డీఎన్‌బీ, ఎంఆర్‌సీపీసీహెచ్ (యూకే), డీసీహెచ్ (యూకే) ఐబీసీఎల్‌సీ డిగ్రీలు చేసి ఉండటంతో ఆక్స్‌ఫర్డ్ ఆస్పత్రిలో సీటు సాధించ గలిగారు. ఈ ఫెలోషిప్ పొందడం ద్వారా స్నేహిత్ రెడ్డి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఆస్పత్రి చిన్న పిల్లల విభాగంలో ఎండోక్రైనాలజీ సూపర్ స్పెషాలిటీ కోర్సు చేసే అవకాశం దక్కించుకోగలిగారు.

ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్..

డాక్టర్ స్నేహిత్‌రెడ్డి గుంటూరులో పదో తరగతి, విజయవాడలో ఇంటర్ వరకు చదువుకున్నారు. ఎంబీబీఎస్ ఆంధ్రా మెడికల్ కళాశాల (ఏఎంసీ)లో పూర్తి చేశారు.

ముంబైలోని లోకమాన్య తిలక్ మునిసిపల్ మెడికల్ కళాశాలలో ఎండీ పీడియాట్రిక్స్ పూర్తి చేశారు. అక్కడే బాయ్ జార్భాయ్ వాడియా ప్రముఖ చిన్న పిల్లల ఆస్పత్రిలో సీనియర్ రెసిడెన్సీగా ఒక సంవత్సరం పని చేశారు. తర్వాత అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో చిన్న పిల్లల వైద్యుడుగా పని చేశారు. సూపర్ స్పెషాలిటీ కోర్సు చదువుకు ఇబ్బందిగా ఉంటోందనే ఉద్దేశంతో ఉద్యోగానికి రాజీనామా చేశారు. ప్రస్తుతం విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తున్నారు. స్నేహిత్‌రెడ్డి తల్లిదండ్రులు గుంటూరు జిల్లా ముట్లూరు జేవీఆర్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా, తండ్రి అదే పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు.

ముగిసిన సౌత్ జోన్ ఫిజీషియన్ల సదస్సు

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించిన సౌత్ జోన్ అండ్ సౌత్ మిడ్ జోనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా సదస్సు విజయవంతంగా ముగిసిందని సదస్సు కన్వీనర్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. రాంబాబు తెలిపారు. మూడు రోజుల సదస్సు ముగిసిన నేపథ్యంలో సిరిపురం వద్ద ఉన్న చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. సదస్సుకు దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాల నుంచి 1200 మంది ఫిజీషియన్లు హాజరయ్యారని చెప్పారు. అలాగే దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 67 మంది నిపుణులు పాల్గొని వైద్య పద్ధతుల్లో వచ్చిన అధునాతన మార్పులను తెలియజేసినట్టు తెలిపారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, గుండె నొప్పిని ముందుగా ఎలా గుర్తించాలి, ప్రమాదకర స్థితిలో రోగి వస్తే ఏవిధమైన సేవలు అందిం చాలన్న విషయాలను తెలియజేసినట్టు పేర్కొన్నారు. నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడం, టెలీ మెడిసిన్, డిజిటల్ ల్యాబ్ రిపోర్టులను భద్రపరచడం వంటి అంశాలపై చర్చించినట్టు తెలిపారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



స్వామివారికి స్వర్ణ పుష్పాలతో పూజ చేస్తున్న దృశ్యం

సింహాచలం, సెప్టెంబరు 22 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు బయ టకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక సిరి సంపెంగతో అర్చన జరిపారు.

నూకాంబికను దర్శించుకున్న 'రివైండర్' దర్శకుడు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న కల్యాణ్ చక్రవర్తి

కొత్తూరు, సెప్టెంబరు 22: ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారిని రివైండర్ చిత్రం దర్శకుడు పెంటకోట కల్యాణ్ చక్రవర్తి ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైర్ క్రియేషన్స్ బేనర్‌లో హీరో సాయి రోనాక్, హీరోయిన్ అమృత చౌదరి, ప్రధాన పాత్రలో హీరో సురేష్, స్మామాట్ రెడ్డి, జబర్దస్త్ బ్యాచ్, ఫన్ బకెట్ కామెడీ, సంగీతం ఆశీర్వాద్ నటించారన్నారు. ఈ చిత్రం అక్టోబరు 18న తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ కానున్నదని, కొత్త కథనంతో ప్రజలందరికీ నచ్చే విధంగా రూపొందించామన్నారు. తమకు అమ్మవారి ఆశీస్సులతో పాటు ప్రజాదరణ కూడా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నూకాంబిక అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ మళ్ల సురేంద్ర, దేవస్థానం సిబ్బంది వేగి మురళీ, వాసు, సందీప్ పాల్గొన్నారు.

కోనాం జలాశయానికి భారీగా వరద నీరు



మెయిన్ గేట్లు, దిగువ గేట్ల ద్వారా విడుదలవుతున్న సాగునీరు

చీడికాడ, సెప్టెంబరు 22: మండలంలో కోనాం జలాశయం నీటిమట్టం ఆదివారం ఉదయానికి 98.50 మీటర్లకు చేరుకుంది. జలా శయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, జలాశయం ఎగువ ప్రాంతాల నుంచి 180 క్యూసెక్కులు వరద నీరు వస్తుండగా ఎగువ, దిగువ కాలువల ద్వారా వంద క్యూసెక్కులు, అలాగే మెయిన్ గేట్ల ద్వారా 80 క్యూసెక్కులు వృథాగా బొడ్డేరులోకి పోతోంది. అయితే రెండు రోజులుగా తుఫాన్ వర్షాలు కురుస్తుండడంతో నీటిమట్టం వంద మీటర్లకు చేరవచ్చునని నీటి పారుదలశాఖ ఏఈ జయరాంపడాల్ విలేకరులకు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో పూర్తిస్థాయిలో వరి పంటకు సాగునీరు అందజేస్తామని ఆయన చెప్పారు.

పసర మందులతో ప్రాణాలకు ప్రమాదం

▸ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతి

చింతపల్లి, సెప్టెంబరు 22: చిన్నారులకు పసర మందులు పడితే ప్రాణాలకే ప్రమాదమని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గంటా ప్రభావతి హెచ్చరించారు. పసర మందు పట్టడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురైన ఓ చిన్నారిని తల్లిదండ్రులు ఆదివారం ఆస్పత్రికి తీసుకొచ్చారు. శిశువును పరీక్షించి ఆమె చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ శిశువులు, చిన్నారులకు గుండె జారిందనే అపోహతో చెక్క మందులు నూరి పట్టిస్తున్నారన్నారు. జి.మాడుగుల మండలం వంజరి పంచాయతీ మర్రిపాలెం గ్రామానికి చెందిన వంతల సంజీవణి, రమేశ్ దంపతుల ఏడాది శిశువుకి గుండె జారిందని పసర మందు పట్టారన్నారు. శిశువు ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో ఆస్పత్రికి తీసుకొచ్చారన్నారు. ప్రస్తుతం ఈ శిశువు శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని, కడుపు ఉబ్బిపోయిందన్నారు. శిశువుకు ఆక్సిజన్ పెట్టి ప్రత్యేక పర్యవేక్షణలో మెరుగైన చికిత్స అందిస్తున్నామన్నారు. కొన్ని సందర్భాల్లో శిశువుల ఆరోగ్యం కాపాడడం చాలా కష్టంగా ఉంటుందన్నారు. మెరుగైన చికిత్స కోసం మైదాన ప్రాంతాలకు పంపించినా ఆదివాసీలు వెళ్లేందుకు నిరాకరిస్తున్నారన్నారు. శిశువులు, చిన్నారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ పసర మందులు పట్టవద్దని ఆమె సూచించారు.

సహజ జలాల పరిరక్షణకు మొక్కలు నాటాలి

చింతపల్లి, సెప్టెంబరు 22: సహజ జలాల పరిరక్షణకు మొక్కలు నాటాలని విశాఖ పోర్టు అథారిటీ కార్యదర్శి టి.వేణుగోపాల్ కోరారు. గొందిపాకలు పంచాయతీ కేంద్రంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు నేటికీ ఊటలపై ఆధారపడుతున్నారన్నారు. నవ నిర్మాణ సమితి ప్రతినిధులు కొండ జలాలను కొళాయిల ద్వారా అందించడానికి గ్రావిటీలను నిర్మిస్తున్నారన్నారు. విశాఖ పోర్టు అథారిటీ లక్ష మొక్కలను అందజేస్తుందని, ఈ మొక్కలు గిరిజన ప్రాంతంలో నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో పోర్టు అథారిటీ చీఫ్ మేనేజర్ ఉయ్‌భాస్కర్, హార్టికల్చర్ ఏడీ రాధిక, డిప్యూటీ పర్సనల్ అధికారి కనకరాజు, పర్యవరణ సూపర్‌వైజర్ సుధీర్, ల్యాండ్‌స్కేప్ ఆర్కిటెక్ చాందిని, నవనిర్మాణ సమితి కార్యదర్శి రఘురామ్, పీడీ శివకుమార్, సర్పంచ్ వరలక్ష్మి, కార్యదర్శి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పిల్లర్లకే పరిమితం..!

▸ అసంపూర్తిగా ఏటీడబ్ల్యూవో కార్యాలయ భవనం
▸ మూడేళ్లుగా ముందుకు సాగని నిర్మాణ పనులు
▸ ఇరుకుగదిలోనే అధికారులు, సిబ్బంది విధులు



స్కూల్ కాంప్లెక్స్‌లోని ఓ గదిలో ఏర్పాటుచేసిన కార్యాలయం



పిల్లర్లతో నిలిచిన ఏటీడబ్ల్యూవో కార్యాలయ భవనం ఇదే..

అనంతగిరి, సెప్టెంబరు 22: మండల కేంద్రంలోని సహాయ గిరిజన సంక్షేమ అధికారి కార్యాలయ భవనం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. 2019-20లో గిరిజన సంక్షేమ శాఖ నిధులు రూ.18 లక్షలతో ఈ భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఏడాదిపాటు నత్తనడకన సాగి, ఏదోలా పిల్లర్ల దశ వరకు పూర్తి చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కనీసం ఈ భవన నిర్మాణంపై దృష్టిసారించలేదు. దీంతో అధికారి, సిబ్బంది ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం స్కూల్ కాంప్లెక్స్‌లోని ఓ చిన్న గదిలో ఈ సహాయ గిరిజన సంక్షేమశాఖ అధికారి కార్యాలయం నిర్వహిస్తున్నారు. గిరిజన సంక్షేమశాఖ అధికారి, మండలంలోని 14 ఆశ్రమ పాఠశాల నిర్వహణ, ఇతర అంశాలపై హెచ్‌ఎంలతో సమావేశాలు నిర్వహిస్తుంటారు. చిన్న గది కావడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ భవనం నిర్మాణ పనులను కాంట్రాక్టర్ మధ్యలో నిలిపి వెళ్లిపోవడానికి కారణాలు తెలియడంలేదు. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు ప్రారంభించాలంటే మళ్లీ టెండర్ ప్రక్రియ ద్వారా జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి భవనం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజాప్రతినిధులు, గిరిజనులు కోరుతున్నారు.

పూర్తికాని వంతెన.. తీరని చింతన!

▸ అసంపూర్తిగా జామిగూడ-గుంజివాడ వంతెన
▸ వర్షం కురిస్తే ఐదు గ్రామాలకు రాకపోకలు కష్టం
▸ అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి ప్రయాణం
▸ నిత్యావసర సరకులకు పడరాని పాట్లు
▸ పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ప్రాణాలకు తెగించి జామిగూడ గెడ్డ దాటుతున్న గిరిజనులు...



గెడ్డ దాటడానికి ఆనప డిప్పలు కట్టుకుంటున్న దృశ్యం

పెదబయలు, సెప్టెంబరు 22: మండలంలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దునున్న జామిగూడ పంచాయతీ పరిధిలోని వంతెన లేక ఐదు గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోతున్నాయి. మరీ అత్యవసరమైతే ఆనప డిప్పల సాయంతో ప్రాణాలకు తెగించి గెడ్డను దాటాల్సిన దుస్థితి. కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జామిగూడ-గుంజివాడ మధ్యనున్న గెడ్డ పొంగి ప్రవహిస్తోంది. దీంతో అటువైపు రాకపోకలు స్తంభించాయి. ఇటీవల జామిగూడకు చెందిన ఆశ కార్యకర్త మృతి చెందడడంతో ఆమెను చివరిసారి చూసేందుకు గెడ్డ ఆవలనున్న బంధుమిత్రులు అతికష్టం మీద ఆనప డిప్పలను చుట్టుకుని ప్రాణాలకు తెగించి గెడ్డ దాటాల్సి వచ్చింది. రెండేళ్ల క్రితం వంతెన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మాణ పనులను గాలికి వదిలేశారు. కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతోనే పనులు సాగలేదని గిరిజనులు వాపోతున్నారు. వర్షాలు కురిస్తే బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండడంతో నిత్యావసరాలు కూడా అందక అవస్థలు పడుతున్నామని, అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



దసరా ఉత్సవాలకు పందిరి రాట వేస్తున్న పెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు

దసరా ఉత్సవాలకు పందిరి రాట

పాడేరు రూరల్, సెప్టెంబరు 22: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు మెయిన్ బజారులో వచ్చే నెల 8 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు ఆదివారం పందిరి రాట ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య విజయవంతంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వెయ్యాకుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి యాదగిరి శ్రీనివాస్, సభ్యులు గంగపూజారి శివకుమార్, పచ్చా బుజ్జి, బూరెడ్డి రామునాయుడు, కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, కిల్లు కోటిబాబు, బోనంగి రమణ, ధన్నేటి పలాసి రాము, బుద్దా జ్యోతికిరణ్, ముల్లంగి రామకృష్ణ, కొమ్మోజు రమణ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఉమానీలకంఠేశ్వర ఆలయానికి ఇత్తడి గంటలు



ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయానికి ఇత్తడి గంటలను బహూకరిస్తున్న దాతలు

పాడేరు రూరల్, సెప్టెంబరు 22: పురాతన శైవక్షేత్రం ఉమానీలకంఠేశ్వర స్వామివారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి పాడేరు పట్టణానికి చెందిన భక్తులు బైరం వెంకటగణపతి రాసి దంపతులు, బైరం అప్పారావు నాగలక్ష్మి దంపతులు ఆదివారం 30 కిలోల మూడు ఇత్తడి గంటలను బహూకరించారు. ఆలయ ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యుల సమక్షంలో ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడుకు అందించారు. ఈ గంటలను మహాశివుని, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, అయ్యప్పస్వామి ఆలయంలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఉప్పలరామం పంతులు, ఆలయ ప్రధాన కార్యదర్శి యూవీ.రత్నం, కమిటీ ప్రతినిధులు బీవీఎస్.ముకుందరావు, ఎస్.కొండలరావు, వై.శ్రీనివాస్, వి.రాజబాబు, కె.పోతురాజు, కె.ప్రభాకర్, పి.రవిశంకర్, సదాశివవర్మ, మహిళా ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు జ్యోతి, రమాదేవి, గాయిత్రీదేవి, భాగ్యలక్ష్మి, వేణమ్మ పాల్గొన్నారు.

ఉధృతంగా వాగులు.. కూంబింగ్ పార్టీలకు అవస్థలు



ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటుతున్న ప్రత్యేక పోలీసు బలగాలు

చింతపల్లి, సెప్టెంబరు 22: ఏవోబీ సరిహద్దులోని బలపం పంచాయతీలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కూంబింగ్ పార్టీ పోలీసులు సైతం అవస్థలు తప్పడం లేదు. గిరిజన ప్రాంతంలో కురిన వర్షాలకు రాళ్లగెడ్డ, చెరువూరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ చెరువులు దాటుకుని ప్రయాణించేందుకు ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా సీపీఐ మావోయిస్టు ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో సరిహద్దు గ్రామాల్లో ప్రత్యేక పోలీసు బలగాలు కూబింగ్ నిర్వహిస్తున్నాయి. ఆదివారం రాళ్లగెడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అన్నవరం సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఒకరి చేయి మరొకరు పట్టుకుని దాటారు. వాహనాల రాకపోకలకు సైతం అంతరాయం కలుగుతోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రాళ్లగెడ్డ వాగు వద్ద బ్రిడ్జిని నిర్మించాలని ప్రాంతీయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డిగ్రీ పోస్టుమెట్రిక్ వసతి గృహంలో రాత్రి స్టడీ

చింతపల్లి, సెప్టెంబరు 22: స్థానిక డిగ్రీ పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో తొలిసారిగా రాత్రి స్టడీని ప్రారంభించారు. ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో భోజన, వసతి మాత్రమే కల్పిస్తున్నారు. విద్యార్థులను రాత్రివేళ కూర్చోబెట్టి చదివించే విధానం లేదు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయభారతి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో విద్యార్థులను కూర్చోబెట్టి చదివిస్తూ స్టడీ సమయం పాటిస్తున్నారు. తనకు సబంధంలేకపోయినా విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టేందుకు వసతి గృహాల్లో స్టడీ సమయం ఏర్పాటు చేశామని, తాను ప్రిన్సిపాల్‌గా ఉన్నంత వరకు స్టడీ సమయం నిర్వహిస్తారని ఆమె తెలిపారు.

పైకప్పు శిథిలం.. వర్షంలోనే విద్యాభ్యాసం

▸ బూదరాళ్ల పంచాయతీ అన్నవరం పాఠశాలలో దుస్థితి





శిథిలమైన పాఠశాల పైకప్పు... ఓ మూలన కూర్చొన్న విద్యార్థులు

కొయ్యూరు, సెప్టెంబరు 22: బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని అన్నవరం గ్రామంలో శిథిలమైన భవనంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చిన్నారుల చదువులు సాగుతున్నాయి. మూడేళ్ల క్రితం ఈదురు గాలులకు భవనం పైకప్పు రేకులు దెబ్బతిన్నాయి. అప్పటినుంచి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో పాఠశాలలో చదువుతున్న 15 మంది చిన్నారులకు శిథిల భవనంలోనే బోధన సాగుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టికి విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు సమస్య తీసుకువెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. భవనానికి రెండు గదుల పైకప్పులు ధ్వంసం కావడంతో వర్షాలు పడితే విద్యార్థులు ఓ మూలకు చేరి ఉండాల్సి వస్తోంది. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున ఏ క్షణాన ఈ భవనం కూలుతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోలు స్పందించి ఈ భవనానికి తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

చింతపల్లి, ముంచంగిపుట్టులో భారీ వర్షం



ముంచంగిపుట్టులో హోరున కురుస్తున్న వాన

చింతపల్లి, సెప్టెంబరు 22: మండలంలో భారీ వర్షం కురిసింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు విడతల వారీగా కుండపోత వాన పడింది. దీంతో ప్రధాన రహదారులు వాగులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాల్లో వర్షపు నీరు చేరుకున్నది. వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కోరుకొండ సంతలో వినియోగదారులు, వర్తకులు వర్షానికి ఇబ్బంది పడ్డారు.

ముంచంగిపుట్టు: మండల పరిధిలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి వాగులు, మత్స్యగెడ్డ పాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లోకి వరదనీరు ఇన్‌ఫ్లో పెరుగుతున్నది. పలు చోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. మట్టి రహదారులు బురదమయంగా మారవడంతో వాహన రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లక్ష్మీపురం ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్న మూడు వంతెనల పనులను త్వరగతిన చేపట్టాలని ఆ ప్రాంతీయులు అంటున్నారు. చినుకుపడితే గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, ఇవి పూర్తయితే కష్టాలు గట్టెక్కుతాయని వారు పేర్కొన్నారు.

జోలాపుట్టు జలాశయంపై మొక్కుబడిగా తనిఖీలు

▸ సరిహద్దులో యథేచ్ఛగా వాహన రాకపోకలు
▸ చోరీలు జరుగుతున్నా పట్టించుకోని పోలీసులు



జోలాపుట్టు జలాశయంపై వాహన మార్గంలో తెరిచి ఉంచిన గేట్లు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 22: మండలంలోని ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలను కలిపే జోలాపుట్టు జలాశయంపై మొక్కుబడి తంతుగా వాహన తనిఖీలను నిర్వహిస్తున్నారు. ఈ మార్గంలో ఇరు రాష్ట్రాలకు చెందిన వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అటుగా వచ్చే వాహనాల నంబర్లను, ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నారనే విషయాలతో పాటు ఇతర వివరాలను రికార్డు చేయాల్సి ఉంటుంది. అందుకు రెండు జలాశయాలపైన ఆంధ్రా, ఒడిశాకు చెందిన సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేశారు. అయితే రెండు జలాశయాలపై వాహన మార్గంలో గల గేట్లు నిత్యం తెరిచే ఉంటున్నాయి. అలాగే రేయింబవళ్లు తేడా లేకుండా అటుగా వాహన రాకపోకలు జరుగుతున్నా కనీసం తనిఖీలు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఒడిశాకు చెందిన దొంగలు ఆంధ్రా భూ భాగంలోకి సులువుగా చొరబడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో సైతం ఒడిశాకు చెందిన ద్విచక్ర వాహన దొంగల ముఠా ఆంధ్రా ప్రాంతానికి చెందిన ముంచంగిపుట్టు, పెదబయలు, అరకు, డుంబ్రిగూడ, పాడేరు, జి.మాడుగుల తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన విషయం తెలిసిందే. అప్పట్లో ఆంధ్రా పోలీసులు చాకచక్యంగా అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకొని విచారించగా దొంగతనాలు చేసిన ద్విచక్ర వాహనాలను జోలాపుట్టు సరిహద్దు వంతెనపై నుంచే ఒడిశాకు తరలిస్తున్నట్టు తెలిసిందే. అప్పట్లో కొన్ని రోజులు పాటు సరిహద్దు వంతెనల వద్ద తనిఖీలు సక్రమంగా చేపట్టిన గార్డులు ప్రస్తుతం యథాస్థితికి వచ్చేశారు. డుడుమ, జోలాపుట్టు సరిహద్దు జలాశయాల వద్ద మొక్కిబడి తంతుగా తనిఖీలు చేస్తున్నారు. ఇదే అదునుగా గత కొద్ది రోజులుగా మండల పరిధిలో దొంగతనాలు జోరందుకున్నాయి. ఇప్పటికే సరిహద్దు ప్రాంతంలో ఒక ఇంటిలో దొంగలు చోరీ చేయడంతో పాటు వివిధ ప్రాంతాల్లో మూడు ద్విచక్ర వాహనాలను ఎత్తుకుపోయారు. మరిన్ని దొంగతనాలు జరగకుండా ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు సరిహద్దు వంతెనల వద్ద తనిఖీలు సక్రమంగా చేపట్టాలని కోరుతున్నారు.

బదిలీల జాతర

... 5వ పేజీ తరువాయి

బి.విగ్గీస్‌లను కృష్ణా జిల్లాకు బదిలీ చేశారు. జీకే వీధి, డుంబ్రిగుడ, చింతపల్లి, కొయ్యూరు, అనంతగిరి ఎంపీడీవోలు వై.ఉమామహేశ్వరరావు, ఉషారాణి, ఆశాజ్యోతి, మేరీరోస్, వి.నగేశ్‌లకు బదిలీలు జరగలేదు. అలాగే బదిలీలు జరిగిన వారి స్థానంలోనూ ఇంకా ఎవర్నీ నియమించలేదు.

తహసీల్దార్లు

ఉమ్మడి విశాఖ జిల్లాలో 16 మంది తహసీల్దార్లకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆదివారం పొద్దుపోయిన తరువాత ఉత్తర్వులు ఇచ్చారు. పార్వతీపురం, శ్రీకాకుళం నుంచి వచ్చిన ముగ్గురు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న మరో ముగ్గురికి విశాఖలో పోస్టింగ్స్ ఇచ్చారు. విశాఖ నుంచి ముగ్గురికి అనకాపల్లికి, అనకాపల్లి జిల్లా నుంచి మరో ఇద్దరు అల్లూరి సీతారామరాజు జిల్లాకు పంపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ ఏవో ఎంటీ. అప్పారావును విశాఖ కలెక్టరేట్‌లో మేజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా, జి. మాడుగుల తహసీల్దారు పి. లచ్చాపాత్రుడ్ని మహారాణిపేట తహసీల్దారుగా, డుంబ్రిగుడ, అరకు తహసీల్దార్లు నాగమ్మ, ఎ. వేణుగోపాల్‌లను అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు. విశాఖ కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్లుగా గతంలో పోస్టింగ్స్ పొందిన ఎ. శ్రీనివాసరావును అనకాపల్లి, వి.శ్యాంకుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, మాకవరపాలెం తహసీల్దార్లు కె.జయప్రకాష్, ఎంవీవీ. ప్రసాద్‌లను అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

అల్లూరి, అనకాపల్లి జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లను సంబంధిత జిల్లా కలెక్టర్ పోస్టింగ్స్ ఇవ్వనున్నారు. కాగా విశాఖ జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లు, ఇతర ఉద్యోగుల బదిలీలపై కలెక్టర్ సంతకం చేసినా వివరాలు బయటకు వెల్లడించలేదు.

నేడు అన్ని శాఖల్లో ఉత్తర్వులకు అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం విధించిన బదిలీల గడువు ఆదివారంతో ముగియడంతో సోమవారం దాదాపుగా అన్ని శాఖలకు సంబంధించిన బదిలీల ప్రక్రియలు పూర్తికానున్నాయి. ఆదివారం సెలవు కావడంతో పలు శాఖల్లో బదిలీలు జరిగినప్పటికీ, వాటి ఉత్తర్వులు ఇంకా విడుదల కాలేదు. దీంతో సోమవారం అన్ని ఉత్తర్వులు జారీ అవుతాయని అధికారులు, ఉద్యోగులు భావిస్తున్నారు.

కాగా, అన్ని ప్రభుత్వ శాఖల్లో కంటే గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థలోనే అధికంగా బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

☛ సంక్షిప్తంగా..

వరదలకు దెబ్బతిన్న గృహాలకు రూ.10 వేల పరిహారానికి ప్రతిపాదన

▸ జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

పాడేరు రూరల్, సెప్టెంబరు 22: వరదలకు దెబ్బతిన్న గృహాలకు రూ.10 వేలు చొప్పున నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వివరాలను జిల్లాలోని మూడు ఐటీడీఏ పరిధిలో అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రకటించామని చెప్పారు. లబ్ధిదారులు ఈ జాబితాలను గమనించి అభ్యంతరాలు, క్లెయిమ్‌లను ఆయా మండలాల తహసీల్దార్ లేదా ఎంపీడీవోల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే చింతూరు ఐటీడీఏ పరిధిలోని ముంపు మండలాల్లో నీట మునిగిన గ్రామాల ప్రజలకు జీవన భృతి చెల్లించేందుకు ప్రతిపాదనలు పంపినట్టు కలెక్టర్ చెప్పారు. ముంపు గ్రామాలు చింతూరు ఐటీడీఏ పరిధిలో మాత్రమే ఉన్నందున ఆయా ముంపు గ్రామాలకు మాత్రమే నష్ట పరిహారం వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ వివరాలు జాబిత చింతూరు ఐటీడీఏ పరిధిలోని అన్ని సచివాలయాల్లో ఆదివారం ప్రకటించామన్నారు. లబ్ధిదారులు జాబితాలను గమనించి అభ్యంతరాలు, క్లెయిమ్‌లు ఉంటే తహసీల్దార్ లేదా ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన తెలిపారు.

24, 25న అరకు నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

పాడేరు రూరల్, సెప్టెంబరు 22: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అరకు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 24, 25వ తేదీలలో నిర్వహించనున్నామని ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వండలం కొండబాబు తెలిపారు. ఈ పోటీలను 24వ తేదీన బాలికలకు, 25వ తేదీన బాలురకు ఏర్పాటు చేస్తామన్నారు. అథ్లెటిక్స్ మాత్రం మండలంలో ఎంపికైన క్రీడాకారులు ఉమ్మడి జిల్లా స్థాయిలో విశాఖలో పాల్గొనాలని చెప్పారు.

'అరకు హెడ్ నర్సుపై చర్యలు తీసుకోవాలి'

చింతపల్లి, సెప్టెంబరు 22: అరకు ఏరియా ఆస్పత్రి హెడ్ నర్సుపై చర్యలు తీసుకోవాలని దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సమరెడ్డి మాణిక్యం డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఒకే చోట ఎక్కువ కాలం విధులు నిర్వహిస్తున్న హెడ్ నర్సు స్వర్ణలత ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అరకులో 17 ఏళ్లు, పాడేరు జిల్లా ఆస్పత్రిలో రెండేళ్లు, ప్రస్తుతం ఐదేళ్లుగా మరలా అరకు ఏరియా ఆస్పత్రిలోనే ఆమె విధులు నిర్వహిస్తున్నారన్నారు. సాధారణంగా ఉద్యోగి ఐదేళ్లు ఒకేచోట పనిచేస్తే కచ్చితంగా స్థాన చలనం ఉంటుందని, హెడ్ నర్సు స్వర్ణలతకు ఏ విధంగా మినహాయింపు ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయాన్ని మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమితి నాయకులు గసాడి మల్లేశ్వరరావు, సావిత్రి, కుదుమలు శేఖర్, జగ్గత్ రాయ్, కాసులమ్మ, ఆనంద్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి



రామారావు (ఫైల్)

డుంబ్రిగుడ, సెప్టెంబరు 22: మండలంలోని కించుమండ గ్రామంలో ఉపాధ్యాయుడు కిరసాని రామారావు (58) గుండెపోటుతో మృతి చెందారు. అనంతగిరి మండలంలోని బొర్రా గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలలో ఎల్‌ఎఫ్ఎల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న రామారావు శనివారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో తుది శ్వాస విడిచినట్టు కుటుంబీకులు తెలిపారు. రామారావు మృతికి ఉపాధ్యాయ సంఘాలు నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

సీలేరులో కంటి వైద్య శిబిరం



నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సీలేరు, సెప్టెంబరు 22: సీలేరులో ఆదివారం ప్రత్యేక కంటి వైద్య శిబిరం నిర్వహించారు. భద్రాచలానికి చెందిన ఇండియన్ ఐ కేర్ ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. చేసిన ఈ శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి ప్రారంభించారు. సీలేరు పరిసర గ్రామాల నుంచి వచ్చిన 90 మందికి కంటి వైద్య నిపుణులు నేత్ర పరీక్షలను చేశారు. వీరిలో కొంత మందికి కంటి అద్దాలను వినియోగించాలని వైద్యులు సూచించారు.

పెదబయలులో స్వచ్ఛత అభియాన్

పెదబయలు, సెప్టెంబరు 22: మండల కేంద్రంలో సీఆర్పీఎఫ్-198 బెటాలియన్ జవాన్లు స్వచ్ఛత అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెదబయలు పోలీస్ స్టేషన్ మొదలుకొని స్టేట్ బ్యాంక్ వరకు ప్రధాన రహదారిపై చెత్తాచెదారాలను తొలగించారు. అలాగే రూడకోట గ్రామంలోని పోలీస్ అవుట్ పోస్టు జవాన్లు మూడు రోడ్ల కూడలిలో వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ దినేశ్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. చుట్టు పక్కల వాతావరణం శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీతగుంట వార్డు సభ్యులు జీవన్‌కుమార్, రూడకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరకులు, దుస్తుల పంపిణీ

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 22: మండలంలోని వరద బాధిత కుటుంబాలకు హుకుంపేట మండల ఉద్యోగులు నిత్యావసర సరకులు, దుస్తులు పంపిణీ చేశారు. చట్రాపల్లి, నిమ్మచెట్టు, మాదిమల్లు గ్రామాలను ఆదివారం ఉద్యోగులు సందర్శించారు. వారి వెంట మినీ వ్యాన్‌లో తీసుకొచ్చిన బియ్యం, కూరగాయలు, నూనె, పప్పుధాన్యాలు, దుస్తులు అందించారు. ఉపాధ్యాయులు, వీఆర్వో, సచివాలయ ఉద్యోగులు వ్యక్తిగత నిధులతో వరద బాధితులకు అవసరమైన సరకులు, దుస్తులు కొనుగోలు చేసిపటేకట ఉపాధ్యాయుడు కంఠంనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు మత్స్యరాజు, సత్యవతి, రత్నకుమారి, శాంత కుమారి, పార్వతి, రాజేశ్వరి, రమ్యాప్రియ, సంధ్యశ్రీ, చంద్రకళ పాల్గొన్నారు.